నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | మార్చి 18, 2024 | www.navatelangana.com

డాక్టరేట్ అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని దంతనపల్లి గ్రామానికి చెందిన దాసండ్ల ప్రభాకర్ సామాజిక సేవాకు గుర్తింపుగా డాక్టరేట్ పట్టా పొందారు. ఆదివారం యెహెూహ యిరే ప్రార్థన మందిర్ ఫాస్టర్ ఆండ్రుస్ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నతమైన స్థాయికి చేరాలని, మరిన్ని అవార్డులు పొందాలని వారు ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సురేష్, దేవేందర్, నారాయణ్, అనిల్, రవి, భూమన్న, ప్రియాంక పాల్గొన్నారు.

ఉచిత గాలికుంటు నివారణ టీకాలు

నవతెలంగాణ-ఇచ్చోడ



మండలంలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఆవులకు, గేదెలకు, ఎద్దులకు ఉచిత గాలి కుంటు టీకాల ఆదివారం సైతం కొనసాగింది. ఈ సందర్భంగా మండలంలోని దేవులునాయక్ తండా గ్రామంలో 270 ఆవులు, 150 గేదెలు, 80ఎద్దులకు గాలి కుంటు టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి గోవింద్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శేఖర్, దేవురావు, రైతులు పాల్గొన్నారు.

హస్తం టికెట్ ఎవరికీ..?

- కసరత్తు పూర్తిచేస్తున్న కాంగ్రెస్ అధిష్టానం
- తాజాగా సీఎం రేవంత్‌ను కలిసిన డా.సుమలత
- ఆతృతగా ఎదురుచూస్తున్న ఆశావహులు
- ఎవరికి వస్తుందోనని ఆ పార్టీ శ్రేణుల్లోనూ తీవ్ర ఉత్కంఠ

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రస్తుతం అందరి దృష్టి హస్తం టికెట్‌పైనే కేంద్రీకృతమవుతోంది. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో అందరి దృష్టి మిగిలిన కాంగ్రెస్ పార్టీపైనే పడుతోంది. రాష్ట్రంలో అధికార పార్టీ కావడంతో ఎవరికి టికెట్ కేటాయిస్తుందనేది తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది. ఇప్పటికే టికెట్ కోసం 22మంది ఆశావహులు దరఖాస్తులు చేసుకోగా..కొత్తగా టికెట్ రేసులో మరికొందరు పేర్లు కూడా వినిపించడం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పలువురి పేర్లను వడపోస్తున్న ఆ పార్టీ అధిష్టానం కసరత్తును కొలిక్కి తీసుకురానుందని తెలుస్తోంది. తాజాగా ఆదివాసీ తెగకు చెందిన ప్రముఖ వైద్యురాలు సుమలత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడం ప్రాదాన్యం సంతరించుకుంది. టీపీసీసీ నుంచి వచ్చిన పిలుపు మేరకు హైదరాబాదు వెళ్లిన సుమలత దంపతులు సీఎం ఇంటికి వెళ్లి ఆయన్ను కలిసినట్లు తెలిసింది.దీంతో హస్తం టికెట్ ఎవరికి వరిస్తుందోనని ఆ పార్టీ శ్రేణుల్లోనూ ఉత్కంఠ నెలకొంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు ఎన్నికల బరిలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయగా.. బీజేపీ నుంచి మాజీ ఎంపీ గోడం నగేష్‌ను పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారుచేసింది. మిగిలిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ తీవ్ర స్థాయిలో నెలకొంది. ఇప్పటికే 22మంది ఆశావహులు టికెట్ కోసం దరఖాస్తులు చేయగా.. ఇందులో ఆ పార్టీ అధిష్టానం కొందరి పేర్లను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. తొలుత టికెట్ రేసులో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, ఆదివాసీ సేన అధ్యక్షుడు దౌలత్‌రావు, పీవీటీజీ ఏపీఒ ఆత్రం భాస్కర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోపక్క ప్రస్తుత ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సైతం లోక్‌సభ బరిలో ఉంటారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత బోథ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆడె గజేందర్ పేరు సైతం తెరమీదకు వచ్చింది. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సైతం టికెట్ ఆశిస్తున్నారు. వీరితో పాటు పలువురు ఉద్యోగులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు సైతం టికెట్ కోసం పోటీలో ఉన్నారు. తాజాగా డా.సుమలతకు టీపీసీసీ నుంచి ఫోన్ రావడంతో ఆదివారం ఉదయం హుటాహుటిన హైదరాబాద్ వెళ్లారు. నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిసినట్లు తెలిసింది. వారితో కొద్దిసేపు మాట్లాడిన సీఎం ముంబాయికి వెళ్లాల్సి ఉండటంతో తిరిగి వచ్చిన తర్వాత మాట్లాడుతానని సుమలత దంపతులకు చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవరికి దక్కుతుందోనని తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది.



ఆచితూచి అడుగులు..!

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. అభ్యర్థి ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు వెల్లడైనా..కాంగ్రెస్ మాత్రం గెలిచే అభ్యర్థి ఎవరైతే బాగుంటుందనే దిశగా తీవ్రస్థాయిలో కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థి గుణగణాలు, ప్రజల్లో గుర్తింపు, ప్రత్యర్థి పార్టీలను ధీటుగా ఎదుర్కోగల సామర్థ్యం తదితర వాటిని పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. సోమవారం జరిగే ఆ పార్టీ సమావేశంలో అభ్యర్థి పేరు వెల్లడిస్తారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆ పార్టీ ఆధ్వర్యంలో పలు సర్వేలు కూడా చేయించినట్లు తెలిసింది. వాటి ఆధారంగానే అభ్యర్థి ఎంపిక ఉంటుందని ఆ పార్టీలు వర్గాలు చెబుతున్నాయి.

పార్టీ శ్రేణుల్లోనూ తీవ్ర ఉత్కంఠ..!

లోక్‌సభ బరిలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసే అభ్యర్థి విషయమై ఆ పార్టీ శ్రేణుల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. దరఖాస్తులు చేసిన వారితో పాటు చేయని వారిలోనూ కొందరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తుండటంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. లోక్‌సభ పరిధిలోని కాంగ్రెస్ నేతలు రోజువారీగా రాష్ట్ర పార్టీ నేతలతో మాట్లాడుతూ ఎవరికి టికెట్ వస్తుందనే విషయమై ఆరా తీస్తున్నారు. అధిష్టానం మదిలో ఎవరి పేరు ఉంది..? ఎవరికి కేటాయిస్తారు..? తదితర విషయాలను అడిగి తెలుసుకుంటున్నారు. మరోపక్క పార్టీ ఎవరైతే బాగుంటుందనే విషయమై చర్చోపచర్చలు సాగిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. అతి త్వరలోనే కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో తేలిపోనుందని ఆ పార్టీలు వర్గాలు చెబుతున్నాయి.

దండం పెట్టుతాం..హెల్మెట్ ధరించండి

- కానిస్టేబుల్ సంజీవ్ అభ్యర్థన



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని తీర్చెల్లి గ్రామ శివారులో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ప్రయాణికులకు కానిస్టేబుల్ సంజీవ్ తనదైన రీతిలో రోడ్డు జాగ్రత్త చర్యలు పాటించాలని కోరారు. దండం పెట్టుతాం.. హెల్మెట్ ధరించాలి అని ఆదివారం వివరించారు. ఓ ద్విచక్ర వాహనదారుడు తన ముగ్గురు పిల్లలు, భార్యతో కలిసి హెల్మెట్ లేకుండా, అజాగ్రత్తగా ప్రయాణించడం గమనించిన కానిస్టేబుల్ సంజీవ్ కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రెండు చేతులు జోడించి హెల్మెట్ ధరించి, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. అజాగ్రత్తగా ప్రయాణం చేస్తే కుటుంబ సభ్యులతో పాటు అందరికి ప్రమాదమని సూచించారు.

ఘనంగా సామూహిక వివాహాలు

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని నర్సాపూర్ గ్రామంలోని విఠల్ రుక్మిణి బాయి ఆలయ ఆవరణలో భగవాన్ బాబా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సామూహిక వివాహాలను వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలతో కలిసి విఠల్ రుక్మిణి బాయి ఆలయంలో ఒకే వేదికపై నూతన వధూవరులకు మెట్టలు, తాళి బోట్లు అందించి సామూహిక వివాహాలు జరిపించారు. ఈ సందర్భంగా హరి భక్త పారాయణులు పురుషోత్తం మహారాజ్ వివాహ ముహూర్తం ప్రాధాన్యతను వివరించి నూతన వధూవరులు ఆదర్శప్రాయమైన జీవనాన్ని కొనసాగించి నేటి తరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఏకమవుతున్న ఆరు జంటలను మాజీ మంత్రి గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజెందర్, బోథ్, ఇచ్చోడ, నేరడిగొండ ఎంపీపీలు తుల శ్రీనివాస్, నిమ్మల ప్రీతం కుమార్ రెడ్డి, సజన్, బీజేపీ నాయకులు ముస్తాపూర్ అశోక్, గిత్తె సూర్యకాంత్, మండల కన్వీనర్ ఏనుగు కృష్ణా రెడ్డి, భగవాన్ బాబా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నూతన వధూవరులను ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామ్‌చందర్ తిడికే, ముండే ధ్రువ పటేల్, భగవాన్ బాబా కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన సల్ల రాజు అనే యువకుడు ఇటీవల మృతి చెందడంతో అతని స్నేహితులు బాదిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఆదివారం బాదిత కుటుంబాన్ని పరామర్శించి రూ.25,500 నగదును ఆయన భార్య జ్యోతికి అందజేశారు. సదరు డబ్బులను కూతురు పేరుమీద ఫిక్సెడ్ డిపాజిట్ చేయించారు. రాజు పేదరికాన్ని చూసి చలించిన అతని చిన్ననాటి మిత్రులు ఆర్థిక సాయం చేయడాన్ని గ్రామస్తులు అభినంధించారు. సదరు డబ్బులను ఆయన మిత్రులు మేస గంగేశ్వర్, కాలేరి దివాకర్, నరేష్, అజీం, కృష్ణమూర్తి, అశోక్, శ్రీనివాస్, సునీల్, జలెందర్ సమక్షంలో అందజేశారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-వాంకిడి

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమవుతున్నాయని, దీనికోసం అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్టు ఎంఈఓ మనుకుమార్ తెలిపారు. విద్యార్థులు అధైర్య పడకుండా పరీక్షలు రాయాలని, సమయపాలన పాటించి విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారను. ఆదివారం ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. మండలంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ఎంఈఓ అన్నారు. పాఠశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని, జిల్లాలో మొదటిస్థానం వచ్చే విధంగా విద్యార్థులు కృషి చేయాలన్నారు.

జీవితంపై విరక్తి చెంది యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-లక్ష్మణ చాంద

జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిసిన వివరాలు ప్రకారం.. మండలంలోని పీచర గ్రామంలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో రుద్రారపు భీమన్న(38) కొన్ని రోజుల నుండి ఆరోగ్యం బాగాలేక బాధపడుతూ, మద్యానికి బానిసయ్యాడు. జీవితం పై విరాక్తి చెంది క్షణిక ఆవేశంలో పురుగులమందు తాగి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. భార్య రుద్రరపు లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



క్రీడా స్ఫూర్తితో లక్ష్యాలను సాధించాలి

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుతూ అనుకున్న లక్ష్యాలను సాధించాలని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేత, రన్నర్ అప్‌గా నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ మేరకు మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈ క్రీడాల ద్వారా స్నేహాన్ని పెంపొందించుకోవాలన్నారు. క్రీడా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. క్రీడల్లో గెలిచినా, ఓడినా ఒకే స్ఫూర్తిని కనబరుస్తూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, నాయకులు సెవ్వ జగదీష్, కుమ్ర రాజు, విజ్జగిరి నారాయణ, రమణ, నవాతే శ్రీనివాస్, చందాల రాజన్న పాల్గొన్నారు.

చెరువు తూమును నిర్మించి సాగునీరందించాలి

- కజ్జర్ల, ఖోడద్ రైతులు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కజ్జర్ల చెరువు తూమును నిర్మించి, సాగునీరందించాలని కజ్జర్ల, ఖోడద్ రైతులు చింతలపెల్లి జయ భారత్‌రెడ్డి, కమలాకర్, కృష్ణారెడ్డి, తిరుపతి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 23 సంవత్సరాల కింద నిర్మించారు. గత గురువారం ఎడమ కాలువ తూము పూర్తిగా విరిగి నీటిలో పడిపోయింది. దీంతో సాగునీటి సరఫరా నిలిచిపోయింది. రైతులు ఈ సంవత్సరం రబీలో పంటలు జొన్న, వేరుశనగ, నువ్వు, గోధుమ, కూరగాయల పంటలు సాగుచేస్తున్నారు. అయితే తూము కూలిపోవడంలో నీటి సరఫరా ఆగిపోవడంతో పంటల సాగుకు నీరందక ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ కింద దాదాపు 600 ఎకరాలు రబి పంట సాగు చేస్తున్నట్టు రైతులు తెలిపారు. రెండు మూడు రోజుల్లో మరమ్మతులు చేయని పక్షంలో 600 ఎకరాల పంట ఎండి పోవడం ఖాయమన్నారు. గత ఖరీఫ్ పంటలో అతివృష్టి అనావృష్టితో పంటలు దిగుబడి రాలేదని అన్నారు. అదేవిధంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాకపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు తూమును మరమ్మతులు చేసైనా లేదా కాలువ నుంచి నీరు వచ్చే విధంగా కృషి చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. రబీకి పంటలకు సాగునీరు అందించకపోతే, పంటలు ఎండిపోతే నష్టపరిహారాన్ని అందించాలని కోరుతున్నారు.



టీఎస్ఎంఎసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర మెడికల్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన వారిని ఆదివారం కాగజ్‌నగర్ ఐఎంఎ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుతో పాటు ఐఎంఎ నేషనల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. టీఎస్ఎంసీ వైస్ ఛైర్మన్ డాక్టర్ జి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎగ్గెన శ్రీనివాస్, రాజ్‌కుమార్, నరేష్‌కుమార్, బర్మా వెంకటేష్‌లను వీరు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ ప్రయివేట్ ఆస్పత్రులలో మెరుగైన వైద్యసేవలందించేందుకు మరింత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ, కాగజ్‌నగర్ యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ నాచగిరి, డాక్టర్ సాయివివేక్, స్థానిక వైద్యులు కృష్ణారావు, అనిత, దశరథం, దామోదర్‌రావు, రావూజీ, సునీత, రామ్‌మూర్తి, రమాకాంత్, ముందాడా, జ్యోతి, కృష్ణమూర్తి, హసీబ్ ఉల్ హక్ పాల్గొన్నారు.



రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఐఎంఎ సభ్యులు

పరిశుభ్రతను పాటించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని అన్ని వార్డుల ప్రజలు పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా సూచించారు. ఆదివారం ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్ ఛైర్మన్ స్వామిశెట్టి రాజేందర్, కౌన్సిలర్లు వార్డులలో పర్యటించారు. రోజుకు రెండు వార్డుల చొప్పున పర్యటిస్తూ ఆయా వార్డుల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ తెలిపారు. బాలాజీనగర్‌లో పర్యటిస్తూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా చెత్త బండిలో వేయాలని సూచించారు. ఆ వార్డు కౌన్సిలర్ తాటి జయచందర్ మంచినీటి పైప్‌లైన్ లీకేజీ సమస్యను ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా తక్షణమే మంచినీటి విభాగం సిబ్బందికి మరమ్మత్తుల కోసం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఛైర్మన్ దస్తగిరి, కౌన్సిలర్లు పిర్సింగుల జయచందర్, నాయకులు షేక్ మహబూబ్, వనమాల రాము, వసీం పాల్గొన్నారు.

కుమ్మరి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

కుమ్మరి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కుమ్మరి జాగృతి నిర్మల్ జిల్లా అధ్యక్షులు భూసారపు గంగాధర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు బీసీ కులాలలో కేవలం 14 కులాలకు మాత్రమే కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని తెలిపారు. అందులో కుమ్మరి కులం లేకపోవడం దురదృష్టకరమనీ ఆవేధన వ్యక్తం చేశారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవనం గడిస్తున్న కుమ్మరి కళాకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కుమ్మరులు ఆర్థికంగా ఎంతో వెనుకబడి, వృత్తిని నమ్ముకుని దుర్భర జీవనాన్ని గడుపుతున్నారన్నారు. కుమ్మరి వృత్తికి నూతన సాంకేతికరణ జోడించనట్లయితే వృత్తి కనుమరుగయ్యే అవకాశం ఉన్నందున కార్పొరేషన్ ఏర్పాటుతో రాష్ట్రంలోని కుమ్మరులకు లబ్ధి చేకూరుతుందన్నారు.

ప్రజావాణి కార్యక్రమం రద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్ సభ ఎన్నికలు-2024 నోటిఫికేషన్ విడుదల అయినందున ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసినంతరం తిరిగి ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ వివరాలను ప్రకటించడం జరుగుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.

బోథ్ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని శివభక్త మార్కండేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.5లక్షల నిధులు మంజూరు అయ్యాయని జెడ్పీటీసీ సంధ్యారాణి అన్నారు. మండల కేంద్రంలోని ఆలయ నిర్మాణ అభివృద్ధికి హామీ ఇచ్చి మాటను నిలబెట్టుకొని కృషి చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కి పద్మశాలి సంఘం, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | మార్చి 18, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-తాంసి

మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన జూనియర్ అసిస్టెంట్ మలపతి స్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆయన మృతిపట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కప్పర్ల గ్రామానికి చెందిన మల్లెల అక్షయ్ గత రెండు రోజుల కింద పంట చేనులో విద్యుద్ఘాతంతో మృతి చెందిన విషయం తెలుసుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని,



కుటుంబ సభ్యులు మనోధైర్యం కోల్పోకుండా ధైర్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, కన్వీనర్‌లు నాగయ్య, అరుణ్, మండల నాయకులు మహేందర్, రఘు, రమణ, అరుణ్, రఘు, కేదారీశ్వర్ రెడ్డి, తిరుమల్ గౌడ్ ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహ పూర్వక వాతావరణంలో పోటీలు నిర్వహించాలని, వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో క్రీడాకారులు సమయపాలన పాటించి ఆడాలని సూచించారు. ప్రారంభ కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, కోఆప్షన్ సభ్యులు దస్తగిర్, నాయకులు రాథోడ్ దత్తారాం, దాదే అలీ, జాకిరుల్లా ఖాన్, ఫెరోజ్ ఖాన్, బిక్షపతి, కోర్రల మహేందర్, రాథోడ్ సుభాష్, సురేష్, సావన్, హైమద్, చిన్నయ్య, శ్రీకాంత్ క్రికెట్ టోర్నమెంట్ సభ్యులు రాథోడ్ సికిందర్ పాల్గొన్నారు.



ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ
- ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు
- ఫిర్యాదులకు సీ-విజిల్ యాప్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా కోరారు. ఎన్నికల కోడ్ నియమావళి అమలులో ఉందని, ఎవరైనా కోడ్‌ను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26 వరకు నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని, జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఓటరు నమోదు చేసుకున్న వారు ఏమైనా తప్పులు ఉంటే సవరణ చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఓటర్‌కు రెండు కిలోమీటర్ల రేడియస్‌లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అవసరమైన మేర బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని స్పష్టం చేశారు.

ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు...

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఖర్చు పరిమితి రూ.95 లక్షలు దాటవద్దని, ఓటర్లను డబ్బులు మద్యంతో ప్రలోభాలకు గురిచేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించు కునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని తెల్పి చెప్పారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ సర్వేలెన్స్ బృందాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగించాలి..

ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సి-విజల్ యాప్ ద్వారా చేయవచ్చని అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదులను స్వీకరించేందుకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, సీ-విజల్ యాప్‌లో లైవ్ వీడియో అప్లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకొని ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్టాండ్, రైల్వే స్టేషన్, పెట్రోల్ బంక్ మొదలైన పబ్లిక్ ప్లేస్‌లలో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రయివేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగించాలని అన్నారు. జిల్లాలో కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నెంబర్, అదేవిధంగా ఎవరు ప్రింట్ చేయమన్నారు వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, వీటిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అక్రమ నగదు, మద్యం రవాణాపై అడ్డుకట్ట వేస్తాం...

ఈ సందర్భంగా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నాలుగో విడతలో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో అవసరమైన మేర 6 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలపాటు గట్టి నిఘా ఉంచామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుండా 50 వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దని, ప్రతిరోజు తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పించి, గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమంగా రవాణా చేస్తున్న రూ. కోటి 67 లక్షల డబ్బులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రాజకీయ పార్టీలు సభలు సమావేశాలు నిర్వహిస్తే ముందస్తుగా పోలీసులు అనుమతి తీసుకోవాలన్నారు. త్వరలోనే జిల్లాకు సీఆర్పీఎఫ్ బలగాలు వస్తున్నాయని, సమస్యాత్మక సున్నితమైన ప్రాంతాల్లో పోలీస్ భద్రత పెంచుతున్నట్టు ఎస్పీ వివరించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారి పట్ల చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే 8712659973 నెంబరుకు వాట్సప్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే గొప్పతనం



నవతెలంగాణ-ఉట్నూర్

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే గొప్పతనమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని బోయవాడ (శాంతినగర్)కాలనీకి చెందిన అజయ్ అనే బాలుడు నరాల బలహీనతతో నడవలేని స్థితిలో ఉన్నాడు. గత కొద్ది రోజుల కింద ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు కార్యక్రమంలో భాగంగా బోయవాడ కాలనీలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న క్రమంలో అజయ్ అనే బాలుడు నరాల బలహీనతతో బాధపడుతూ ఎక్కడ కదలలేని స్థితిలో ఉన్న ఆయన్ను చూసి ఎమ్మెల్యే మానవతా దృక్పథంతో ఆ బాలుడికి ఆదివారం ఉదయం 'వీల్ చైర్'ను అందజేశారు. ఈ సందర్భంగా ఆ బాలుడి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. తమ బాలుడిని ఎవరు ఇప్పటివరకు పట్టించుకోలేదని ఎమ్మెల్యే బాలుడి బాధను తెలుసుకుని సమస్యను తీర్చడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని లచ్చంపూర్ గ్రామంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్తులు వైద్య శిబిరానికి చేరుకొని, వైద్య పరీక్షలు చేసుకోగా, వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు అల్లూరి భూమన్న మాట్లాడుతూ మారుమూల గ్రామమైన లచ్చంపూర్ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. వైద్య శిబిరానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకొని పరీక్షలు చేసుకోవడం పట్ల గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం తరపున రాబోవు కాలంలో మారుమూల గ్రామాలలో మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సంఘం తరపున ఉచిత వైద్యం అందిస్తామన్నారు. వైద్య శిబిర కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వినీత్, ఏఎన్ఎం వెంకటమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రూపారాణి, హెల్త్ సూపర్‌వైజర్ రోహిదాస్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, మాల సంక్షేమ సంఘం నాయకులు శశికాంత్, సాయిబాబా, ప్రశాంత్, అర్క రమేష్, క్రాంతి కుమార్, గజానంద్, రాజేశ్వర్, ఆశన్న, దత్తు, రమేష్, శ్రీనివాస్, పోచ్చన్న, ఆశ వర్కర్ గంగుబాయి పాల్గొన్నారు.

పేద ముస్లిములకు సరుకుల పంపిణీ




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రంజాన్ సందర్భంగా ఉపవాస దీక్షలు పాటించే పేదలు ఇబ్బందులకు గురి కాకుండా ఉండేలా రేషన్ సరకులను పంపిణీ చేస్తున్నామని ఉమీద్ ఫౌండేషన్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేదలకు సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజన్ మాసంలో ఉపవాస దీక్షలు ఉండే వారికి ఎలాంటి ఇబ్బందులు కాకుండా సరకులను అందిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 50 మందికి రేషన్ ప్యాకేజీలను అందించినట్లు తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు షౌకత్ అలీ, ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, కోశాధికారి అబ్దుల్ రషీద్, సెక్రటరీ మొహమ్మద్ అజార్ ఉల్లా, సభ్యులు ముజీబ్ ఉద్దీన్, నౌషాద్, ఉమర్ ఉన్నారు.

ఆర్మూర్ రైల్వేలైన్ రిలే దీక్షల విరమణ

- నియంతృత్వ ధోరణి అవలంభిస్తోన్న బీజేపీ
- నిమ్మరసమిచ్చి విరమింపజేసిన డీసీసీబీ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణి అవలంబిస్తోందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగినరీతిలో బుద్ధిచెప్పాలని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ప్రజా సమస్యలు పట్టని ఆ పార్టీకి ఎవరూ ఓటేయ్యద్దని పిలుపునిచ్చారు. ఆర్మూర్ టూ ఆదిలాబాద్ రైల్వేలైన్ సాధన కోసం స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహం వద్ద గత 62 రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలను ఆదివారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా విరమించారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి హాజరయ్యారు. శిబిరంలో దీక్షాపరులకు నిమ్మరసం ఇచ్చి ఈ దీక్షలను విరమింజేశారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ జిల్లా పర్యటనకు వచ్చి ఆదిలాబాద్ అభివృద్ధి కోసం ఏం ప్రకటించారని అన్నారు. కేవలం మతతత్వ రాజకీయాలు చేయడం తప్పా బీజేపీకి ప్రజల సంక్షేమం, అభివృద్ధి ఏమాత్రమూ పట్టదని మండిపడ్డారు. స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలు ఆర్మూర్ టూ ఆదిలాబాద్ రైల్వే లైన్‌తో పాటు సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశాలను బహిరంగ సభ వేదిక సాక్షిగా పీఎం మోడీ దృష్టికి తీసుకెళితే ఆయన మాట్లాడకుండా వెళ్లిపోయారన్నారు. కనీసం వాటి ఊసే ఎత్తలేదని అన్నారు. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారన్నారు. ఇటువంటి పార్టీని రాబోయే ఎన్నికల్లో ఓడించి గట్టి గుణపాఠం చెప్పాలన్నారు. అటు ఎన్నికల కోడ్ నేపథ్యంలోనే ఈ రిలే దీక్షలను తాత్కాలికంగా విమరణ చేస్తున్నామని, ఎన్నికలు పూర్తవగానే మళ్లీ యథావిధిగా చేపడతామని రైల్వేలైన్ సాధన సమితి చైర్మెన్ సిర్ర దేవేందర్, ప్రధాన కార్యదర్శి నిమ్మల నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాయిన్‌వార్ గంగారెడ్డి, మహ్మద్ రఫిక్‌తో పాటు రైల్వేలైన్ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన అవకాశంతో నియోజకవర్గ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యేగా పాయల శంకర్ గెలుపొందుతే పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన కాలనీవాసులు ఎల్లమ్మ తల్లికి మొక్కులు తీర్చుకుంటామని మొక్కుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం కాలనీవాసులు తమ మొక్కలను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని బోనాలు సమర్పించారు. తమ పట్ల కాలనీవాసులు చూపించిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్, స్వప్నిల్, జోగు రవి, వేదవ్యాస్, రాష్ట్రపాల్, గొర్ల రాము, అశోక్ రెడ్డి, భూమన్న పాల్గొన్నారు.

పార్లమెంట్ కోఆర్డినేటర్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఆదివాసీ కోఆర్డినేటర్‌గా నియమితులైన సెడ్మకి ఆనందరావుకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రజా సేవాభవన్ వచ్చిన ఆయనకు సాదర స్వాగతం పలికి శాలువా పూల బొకేతో సత్కరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, గిమ్మ సంతోష్, దేరా కృష్ణారెడ్డి, అడ్వకేట్ అఫ్రోజ్, యాల్ల పోతారెడ్డి, మోరేష్, లక్ష్మి, నల్వాల సుమ, సోనియా, మంథని పాల్గొన్నారు.

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-ముధోల్

పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్టు ముధోల్ మండల విద్యాధికారి మైసాజీ తెలిపారు. ముధోల్ మండలంలోని అష్ట, ముధోల్ ఆశ్రమ పాఠశాల, రబింద్ర, ముధోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా బాసర మండలంలోని ఒక సెంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు ముధోల్లోని రబింద్ర ఉన్నత పాఠశాల కేంద్రంలో 180 విద్యార్థులకు గాను 13 మంది ఇన్విజిలేటర్లను సంబంధిత ఉన్నతాధికారులునియమించినట్లు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా జి.శ్రీరాములు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా మీర్ అలీ, ఆశ్రమ పాఠశాల కేంద్రంలో 180 విద్యార్థులకు గాను 10 మంది ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌గా సూర్యాదాస్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా బి.నరేష్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే ముధోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 180 విద్యార్థులకు గాను 12మంది ఇన్విజిలేటర్‌లు విధులు నిర్వహిస్తారని అన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా జి.భోజారాం, డీఓగా వందన, అష్టా ఉన్నత పాఠశాల సెంటర్‌లో 120 మంది విద్యార్థులకు గాను 07 మంది ఇన్విజిలేటర్‌లు సీఎస్‌గా గీతా, డీఓగా శ్రీనివాస్‌లు నియమితులయ్యారని తెలిపారు. బాసర మండలంలోని బాసర ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 160 మంది విద్యార్థులకు గాను 10 మంది ఇన్విజిలేటర్‌లు, సీఎస్‌గా టి.రాజయ్య, డీఓగా నర్సారెడ్డిలు, విధులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం12:30 వరకు ఉంటాయని ఎంఈఓ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మంచి నీటి సౌకర్యం, ఫ్యాన్లు, ఫర్నిచర్, సీసీ కెమెరాలతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. సీసీ కెమెరా పర్యవేక్షణలో ప్రశ్న పత్రాలు తెరువనున్నామన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎట్టి పరిస్థితుల్లో ఎవరికి సెల్ ఫోన్‌లు అనుమతి లేదన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకరావద్దన్నారు. పరీక్షా సమయాల్లో ఉదయం 09.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షా కేంద్రాలు, మండల ప్రధాన కార్యాలయాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలను మూసివేయడంతో పాటు పరీక్ష కేంద్రం బడి నుంచి 200 మీటర్ దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మందులతో వైద్య బృందాలను ఏర్పాటుతో పాటు పోలీస్ సిబ్బంది. ఉంటుందన్నారు. పరీక్షా సమయాల్లో అన్ని పరీక్షా కేంద్రాలకు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందని, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, మరుగుదోడ్లతో పాటు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి పుకార్లు, వదంతులు నమ్మకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అన్నారు.

నార్నూర్ : పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాటు పూర్తయినట్టు ఎంఈఓ ఆశన్న పేర్కొన్నారు. సోమవారం నుంచి నిర్వహించే పరీక్షకు ఉమ్మడి మండలంలో మూడు సెంటర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నార్నూర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల కేంద్రంలో 208మంది, తాడిహత్నూర్ జెడ్పీఎస్ఎస్‌లో 191, గాదిగూడ మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో 165 మంది పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విద్యార్థులు పరీక్షకు సరైన సమయంలో పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని సూచించారు.

ఇంద్రవెల్లి : నేటినుంచి జరుగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ నర్సయ్య తెలిపారు. మండలంలో మొత్తం మూడు పరీక్ష కేంద్రాలు ఉండగా, కెస్లాపూర్‌లో 218 మంది, ఇంద్రవెల్లి (బాలికలు) యందు 200 మంది, జడ్పీ పాఠశాలలో 260 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్టు తెలిపారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాతో పాటు సీఎస్‌డీఓలను నియమించామని ఎంఈఓ తెలిపారు.

రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సంఘం నిబంధనలను ఆయా రాజకీయ పార్టీలు పాటించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాజర్షిషా అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవిలతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల సమావేశాలకు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ప్రశాంతవంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా సువిధ పోర్టల్‌లో రాజకీయ నాయకులు అనుమతులు తీసుకోవాలని, ర్యాలీల సందర్భంగా భారీ శబ్దంతో కూడిన డీజే సౌండ్‌లు నిషేధమని తెలిపారు. ఎవరు కూడా వ్యక్తిగత దూషణలకు పాల్పడవద్దని స్వీయ నియంత్రణను కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న రాజకీయ ప్రచార పోస్టర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు, ప్రయివేట్ ప్రాంతాలలో రాజకీయ పోస్టర్లు ఏర్పాటు చేస్తే వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు పరీక్షలు రాయాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తును నిర్ణయించేది 10వ తరగతి పరీక్షలేనని వెల్లడించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలు రాసె విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ఉండాలని విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. విద్యార్థులు భయం ఒత్తిడిని వీడి ఇష్టంతో పరీక్షలు మంచిగా రాసి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



న్యూ కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే హరీష్ బాబు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం హోమం నిర్వహించి అభిషేకం, పడిపూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు పోతురాజుల రమేష్, కార్యదర్శి ఎనగంటి భిక్షపతి, కోశాధికారి శంకరయ్య, కమిటీ సభ్యులు గణేష్ నాయర్, సింధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-వాంకిడి



డెయిలీ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ఎల్ఐసీ ఏజెంట్ అరుణ్‌కుమార్, ఏకే ట్రైలర్ యజమాని చాంద్‌పాషా ప్రారంభించారు. క్రికెట్ టోర్నమెంటులో మొత్తం తొమ్మిది జట్లు పాల్గొన్నట్టు వారు తెలిపారు. గెలుపొందిన జట్టుకు రూ.20 వేలతో పాటు ట్రోఫీ, రెండవ బహుమతి రూ.10 వేలతో పాటు ట్రోఫీని అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు కలిగి ఉండాలి

- కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన దృష్ట్యా ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా నగదును తీసుకెళ్లవద్దని, ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దులో గల వెంకట్రావ్‌పేట్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. కౌటాల మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన నరులె భరత్ అనే వ్యక్తి మహారాష్ట్రలోని రాజురా నుండి కౌటాలకు బొలోరో వాహనంలో వస్తున్నాడు. వాహనాన్ని తనిఖీలు చేయగా అతని వద్ద రూ.2.72 లక్షలు, ఛత్తీస్‌ఘడ్ నుండి హైదరాబాద్‌కు బొలోరో వాహనంలో ఇంద్రజిత్ రేణుకె వద్ద రూ.70 వేలు, మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుండి బెజ్జూరు మండలం తలాయికి నాజిమ్ సలీమ్ బొలోరో వాహనంలో రూ.1.84 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరి వద్ద నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు లేకపోవడంతో డబ్బులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. ఆయన వెంట కౌటాల సీఐ సాధిక్‌పాషా, సిర్పూర్ ఎస్ఐ దీకొండ రమేష్ ఉన్నారు.

22న టీఎమ్మార్పీఎస్ సదస్సు విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్‌తో ఈనెల 22న ఆదిలాబాద్‌లో నిర్వహించే ఉమ్మడి జిల్లా పార్లమెంట్ సదస్సు విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీజేపీ ఎస్సీ వర్గీకరణ చేస్తామని మొదట అధికారంలోకి వచ్చినప్పుడు హామీ ఇచ్చిందని తెలిపారు. పదేండ్లు పూర్తవుతున్న దానిని నెరవేర్చలేదన్నారు. తాజాగా హైదరాబాద్‌లో సభ నిర్వహించి ఎస్సీల ఓటు బ్యాంకు కోసం మరోసారి మోసం చేసే ప్రయత్నం చేశారన్నారు. హైదరాబాద్ సభ నిర్వహించి నెలలు గడుస్తున్న ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. ప్రస్తుత సమయంలో మాదిగలు ఏకతాటి పైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించడానికి నిర్వహించే పార్లమెంటు సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడుతో సహా ఇతర నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శనిగారపు మల్లేష్, జిల్లా నాయకులు మోతే లక్ష్మణ్, రాజేశ్వరి, మమత, మోహన్, లక్ష్మి, చిన్నక్క, సరిత వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆస్పత్రులు సరే..వైద్యులేరీ..?

- పేరుకే ప్రభుత్వాస్పత్రులు • అరకొర వైద్యంతో జనాల ఇబ్బందులు • పట్టించుకోని యంత్రాంగం... ప్రజాప్రతినిధులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలి...ప్రసవాల సంఖ్య పెంచాలని పదే పదే అధికారులు, ప్రభుత్వాలు చెబుతున్నాయి. అన్ని రకాల వసతులు కల్పించామని ఇక్కడే సేవలు పొందాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం, అధికారుల మాటలు విని ఆస్పత్రులకు వస్తున్న జనాలకు మాత్రం ఇక్కడ సరైన సౌకర్యాలు లేకపోక, వైద్యులు కూడా అందుబాటులో ఉండటం లేదు. అత్యసరమైతే మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాల్లోని ప్రయివేట్ దవాఖనాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. లక్షల కోట్లతో మండలాల్లో పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం అందులో వైద్యులు నియమించడంలో మాత్రం ఎలాంటి ఆసక్తి చూపడం లేదు. దీని కారణంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజనులకు ప్రభుత్వ వైద్యం అందడం లేదు. ఎంతో మంది సరైన సమయంలో వైద్యం అందక మరణించిన దఖాలలున్నాయి. వైద్యులున్న సిబ్బంది ఉండరు. సిబ్బంది ఉన్న వైద్యులుండారు. గిరిజన జిల్లాపై అధికారులు, ప్రభుత్వానికి చిన్నచూపు ఉందనే అనుమనాలు వ్యక్తం అవుతున్నాయి. పేదలకు ప్రభుత్వం అందేలా చూడాలని, ఖాళీ వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు. పీహెచ్‌సీల్లో వైద్యుల ఖాళీలు, సౌకర్యాలపై 'నవతెలంగాణ' కథనం..

-నవతెలంగాణ-కౌటల, బెజ్జూర్, కెరమెరి

పేరుకే ముప్పై పడకల ఆస్పత్రి..



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది లేక, వైద్యమందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది కొరత వేదిస్తుంది. రెండు సంవత్సరాల క్రితం పీహెచ్‌సీగా మార్చి 30 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేసిన పీహెచ్‌సీలో కేవలం ఒక్క డాక్టరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పేరుకు మాత్రమే 30 పడకల ఆస్పత్రిగా బెజ్జూరు వైద్యశాల మిగిలిపోతుంది. సిబ్బంది కొరతతో అత్యవసర సమయాల్లో రోగులు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాగజ్‌నగర్‌కు వైద్యం కోసం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. 24 గంటలు సేవలందించే వైద్యశాలలో డాక్టర్లు లేక రోగులకు ఇక్కట్లు తప్పడంలేదు. అత్యవసర సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. 30 పడకల ఆస్పత్రిగా వైద్య విధాన పరిషత్ గుర్తించిన నేటికి సరైన సౌకర్యాలు కల్పించడం, అందుకు తగ్గట్టుగా వైద్యశాలలో పక్కా భవనాలను నిర్మించకపోవడంతో మండల ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలాగానే మిగిలింది. బెజ్జూరు పీహెచ్‌సీ పరిధిలో ఆరు సబ్‌సెంటర్లు ఉండగా ఇందులో ఏఎన్ఎంలు 12 మంది ఉండాల్సి ఉండగా కేవలం ఎనిమిది మంది ఉన్నారు. ఒక్క సబ్‌సెంటర్‌లో కూడా హెల్త్ అసిస్టెంట్లు లేకపోవడం గమనార్హం. ఆరు సబ్‌సెంటర్లలో కేవలం కర్జెల్లి, దిందా సబ్‌సెంటర్లకు మాత్రమే పక్కా భవనాలు ఉండగా కుకుడ, బెజ్జూరు, ఊద్సరంగపెల్లి, కుంటలమానెపెల్లి సబ్‌సెంటర్లకు పక్కా భవనాలు లేక సక్రమంగా వైద్యం అందడం లేదు. అధికారులు స్పందించి వెంటనే మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

భవనాలు నిర్మించాలి

-వినోద, కుకుడ గ్రామం



బెజ్జూరు 30 పడకల ఆస్పత్రిలో పక్కా భవనాలు నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పించాలి. సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వైద్యం సక్రమంగా అందడంలేదు. వైద్యుల నియమకంతో పాటు పక్క భవనాలు నిర్మించేలా కృషి చేయాలి.

డాక్టర్లను నియమించాలి

-తేజ, మర్తిడి గ్రామం



పేరుకే 30 పడకల ఆస్పత్రిగా ఉంది. ఒక్క డాక్టరు మాత్రమే వారంలో నాలుగు రోజులు వస్తూ ఉంటాడు. వైద్యం సక్రమంగా అందక ఇబ్బంది పడుతున్నాం. అత్యవసర పరిస్థితి వస్తే కాగజ్‌నగర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. వెంటనే డాక్టర్లను నియమించి సౌకర్యాలు కల్పించాలి.

ఇద్దరిలో ఒక్కరే ఉన్నారు..



కౌటాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇద్దరు వైద్యాధికారులు ఉండాల్సి ఉండగా అందులో ఒకరు ఉన్నత చదువుల కోసం లాంగ్ లీవ్‌లో వెళ్లిపోయారు. ఇంకో పోస్టు ఖాళీగా ఉండడంతో రోగులకు సకాలంలో వైద్యం అందలేకపోతుంది. ల్యాబ్ టెక్నీషియన్ సైతం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో కౌటాల మండలంలో మూడు సబ్‌సెంటర్లు ఒకటి గుండాయిపేట్, మొగడ్‌దగడ్, బోదంపెల్లి సబ్‌సెంటర్లలో సైతం పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో వైద్యం అందని ద్రాక్షగా మరింది.

వైద్యులను నియమించాలి

-గోంగ్లె సాయినాథ్, మాజీ ఉప సర్పంచ్, తుమ్మిహేటి



మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, మొగడ్‌దగడ్, గుండాయిపేట్, బోదంపెల్లి సబ్‌సెంటర్లలో సైతం వైద్యులను నియమించాలి. ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ప్రకటనలకు అనుగుణంగా సిబ్బందిని భర్తీ చేయాలి.

వైద్యులు లేక గిరిజనం ఇబ్బందులు



కెరమెరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉండటంతో ఏజెన్సీలో నివసిస్తున్న గిరి ప్రజలకు వైద్యం అందటం లేదు. ఆస్పత్రిలో మొత్తం 24 మంది సిబ్బందికి గాను 16 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. మండలంలో 8 సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 4 ఎంఎల్‌హెచ్‌పీలు పని చేస్తుండగా మిగతా నాలుగు కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతి సబ్ సెంటర్‌లో ఏఎన్ఎం, రెండో ఏఎన్ఎంతో పాటు హెల్త్ అసిస్టెంట్ మొత్తం సబ్ సెంటర్‌కి నలుగురు సిబ్బంది ఉండాలి. కేవలం రెండు సబ్ సెంటర్లలో మాత్రమే సిబ్బంది ఉన్నారు. మిగతా ఆరోగ్య ఉప కేంద్రాల్లో సిబ్బంది లేకపోవడంతో మారుమూల గ్రామాల ప్రజలకు వైద్యం అందడం లేదు.

వైద్యులను నియమించాలి

-తొడసం జగన్నాథ్ రావు, సాంగ్వి మాజీ సర్పంచ్



ఆస్పత్రిలో డాక్టర్లు లేక రోగులకు గోళీలు ఏఎన్ఎం ఇస్తున్నారు. అత్యవస సమయాల్లో ఆస్పత్రిలో ఎవరు ఉండడం లేదు. దీంతో పేదలు కష్టాలు పడుతున్నారు. పేద ప్రజలకు వైద్యం అందాలంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, స్టాఫ్ నర్సులను నియమించాలి.

స్టాఫ్ నర్సులను సర్దుబాటు చేయాలి

-సెడ్మాకి తుకారం, సాకడ గ్రామం



నిరుపేద ప్రజలు, గర్భిణులు ఎక్కువగా ప్రభుత్వం వైద్యంపై ఆధారపడుతున్నారు. చాలా మంది గర్భిణులు ప్రతి నెల వివిధ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వస్తున్నపటికీ వైద్యులు లేక రోగుల సంఖ్య తగ్గుతోంది. ఆరోగ్య సమస్యలు చెప్పుకోవాలన్న వైద్యులు లేక రోగులు ప్రయివేటు బాట పడుతున్నారు. నలుగురు స్టాఫ్ నర్సులను సర్దుబాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

'పల్లె' వెలుగులేవి..?

- రోడ్డు సౌకర్యం ఉన్నా రాని బస్సులు • ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఎన్నికల హామీలకే పరిమితం • అధికారుల సమన్వయ లోపం ప్రజలకు శాపం
- పట్టించుకోని ఆర్టీసీ యాజమాన్యం

గ్రామాలకు రోడ్లు వేసి రవాణా సౌకర్యాలు మెరుగుపరిచామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. రోడ్డు సౌకర్యాలున్న నేటికి ఆ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు రావు. ప్రభుత్వం మహిళల కోసం మహాలక్ష్మీ పథకం కింద ఉచిత ప్రయాణం తీసుకువచ్చింది. అయితే స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని ఏండ్లు గడిచిన నేటికి గ్రామాల్లో సరైన రోడ్డు, బస్సు సౌకర్యం లేదు. దీనికి నిదర్శనమే సిర్పూర్ మండలంలో పలు గ్రామాలు. ఆర్టీసీ బస్సులు వెళ్లని గ్రామాలు నేటికి ఉన్నాయి. దీంతో నిత్యం గ్రామస్తులు తమ పనుల నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పల్లె వెలుగు రాని మండలంలో తొమ్మిది గ్రామాలపై ప్రత్యేక కథనం...

-నవతెలంగాణ - సిర్పూర్(టి)



సిర్పూర్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే రోడ్డు



సిర్పూర్ నుంచి రాజురకు వెళ్లే మార్గం

మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇటుకల్‌పహాడ్ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామంలో ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయం. వీరు అధిక శాఖ కూరగాయలు పండిస్తుంటారు. పండించిన కూరగాయలను మార్కెట్‌కు తరలించాలంటే ప్రయివేటు వాహనాలు, ఎడ్ల బండ్లపై తీసుకొని వెళ్లాలి. అలాగే మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న చీలపెల్లి గ్రామానికి కూడా సరైన రోడ్డు మార్గం లేదు. అదేవిధంగా భూపాలపట్నం, చింతకుంట, కేశవపట్నం, హుడ్కిళి, నవెగాం, లోనవెల్లి, చీలపెల్లి గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు బస్సును మాత్రం నడపడంలేదు. సిర్పూర్ నుండి మహారాష్ట్రకు గతంలో ఆర్టీసీ అధికారులు బస్సును నడిపించేవారు. ఈ మార్గంలో సిర్పూర్ నుండి మాకిడి వరకు తెలంగాణ ప్రభుత్వం, రాజూరా నుండి సిర్పూర్ వరకు మహారాష్ట్ర ప్రభుత్వం బస్సును నడిపించేవారు. ప్రస్తుతం ఆ మార్గంలో బస్సు నడవడంలేదు. ఈ మార్గం గుండా గ్రామాల ప్రజలు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రాత్రి, పగలు ప్రయాణం చేస్తుంటారు. ఈ మార్గంలో గతంలో ప్రమాదాలు ఎన్నో జరిగాయి. బస్సులు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని మహారాష్ట్రకు వెళ్లే ప్రయాణికులు రైలు మార్గాన్ని అనుసరిస్తుంటారు.

అవస్థలు పడుతున్న విద్యార్థులు, రైతులు...

రైతులు పండించిన పంటను మార్కెట్‌కు వాహనాల ద్వారా తరలించాలంటే రోడ్డు, సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి చదువు కోసం వెళ్లే విద్యార్థులకు కష్టలు తప్పడంలేదు. అనారోగ్యానికి గురైనప్పుడు తమ గ్రామాల్లో వైద్యులు లేకపోవడంతో సరైన వైద్యమందక చిన్నపిల్లలు, గర్భిణులు ప్రాణాలు కొల్పోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇటుకల్‌పహాడ్ గ్రామానికి నేటికి 104 వాహనం వెళ్లడంలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నాయకులు, అధికారులు స్పందించాలి...

డోర్‌పెల్లి, లోనవెల్లి, భూపాలపట్నం, చింతకుంట మహారాష్ట్ర మార్గంలో గతంలో బస్సులు నడిచేవి. కానీ ప్రస్తుతం ఆ గ్రామాలకు బస్సులు నడపకుండా ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సులతో పాటు సరైన రోడ్డు సౌకర్యం నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి హామీలు ఇస్తూ తర్వాత మరిచిపోతున్నారని, ఇప్పటికైనా ప్రజల మద్ధతుతో గెలిచిన యువ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు చొరవ తీసుకొని తమ గ్రామాలకు బస్సులు నడిపించాలని కోరుతున్నారు.

అన్ని ప్రాంతాలకు బస్సులు నడిపిస్తాం..

- విశ్వనాథ్, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆసిఫాబాద్.



నూతనంగా డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టాను. అన్ని ప్రాంతాలకు బస్సు నడపడానికి ప్రయత్నం చేస్తా. రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలను సర్వే చేసి ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులను నడపడానికి ప్రణాళికలు చేస్తాం. ప్రయాణీకులకు ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా తన వంతు కృషి చేస్తా.

పథకాలు వినియోగించలేకపోతున్నాం

- దోంగ్రె మాణిక్‌రావు, డోర్‌పెల్లి గ్రామస్తుడు



అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రకటించిన మహాలక్ష్మీ ఉచిత ప్రయాణాన్ని పొందలేకపోతున్నాం. దీనికి ప్రధాన కారణం బస్సు సౌకర్యం లేకపోవడమే. డోర్‌పెల్లి గ్రామ పంచాయతీలో జనాబా 1500కు పైగా ఉంటుంది. మా గ్రామం నుండి ప్రతి రోజు కౌటాల, కాగజ్‌నగర్, హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులతో పాటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రయివేటు, ప్రభుత్వ ఉద్యోగాలు చేసే ఉద్యోగస్తులున్నారు. ఇటువంటి మారుమూల గ్రామమైన మాది బస్సు సౌకర్యం కల్పిస్తే సామాన్య, పేద ప్రజలకు ప్రయోజనంగా ఉంటుంది.

మా ఊరికి బస్సు నడిపించండి

- వడాయి రవి, భూపాలపట్నం గ్రామం



మండలంలో మారుమూల ప్రాంతమైన భూపాలపట్నం గ్రామంలో బస్సు సౌకర్యం లేదు. ఆటోల ద్వారా రాకపోకలు చేస్తున్నాం. ఊరిలో ఎవరైన అనారోగ్యంతో ఉన్నప్పటికీ అంబులెన్స్ రాక చాలా ఇబ్బంది పడుతున్నాం. రాజకీయ నాయకులు ఓట్ల కోసం వచ్చి ఎన్నో హామీలు ఇచ్చారే తప్పా ఇప్పటి వరకు బస్సు సౌకర్యం కల్పించడంలో విఫలమయ్యారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి అచ్చెల్లి, చింతకుంట, భూపాలపట్నం, కేశవపట్నం గ్రామం వరకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలు బస్సులు నడిపించాలి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | మార్చి 18, 2024 | www.navatelangana.com

ఎన్‌ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడిగా రామ్ సాయి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఎన్‌ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షునిగా అనసనూరి రామ్‌సాయి నియమితులయ్యారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు ఆదర్శ వర్ధన్ రాజు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామ్ సాయి మాట్లాడుతూ పట్టణంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, రానున్న లోక్ సభ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నాపై నమ్మకంతో తనకు అవకాశం కల్పించిన ఎన్‌ఎస్‌యూఐ జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య పాల్గొన్నారు.

పోస్టర్లు, వాల్ రైటింగ్స్ తొలగింపు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



లోక్ సభ ఎన్నికల కోడ్ అమలుతో మున్సిపాలిటీ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ పోస్టర్స్, రైటింగ్‌లను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆదేశానుసారం యుద్ధ ప్రాతిపదికన మున్సిపల్ సిబ్బంది ఆదివారం పట్టణంలో వివిధ ఏరియాల్లో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రిన్సిపల్ నిర్లక్ష్యంతో విద్యార్థిని మృతి'



నవతెలంగాణ-హాజీపూర్

జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని అనారోగ్యంతో మతిచెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మంచిర్యాలకు చెందిన వహీదా(18) విద్యార్థిని ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతుంది. గత సోమవారం తలనొప్పిగా ఉందని ప్రిన్సిపల్‌కు చెప్పిన పట్టించుకోలేదని ఆరోపణలు వస్తున్నాయి. పరిస్థితి విషమించడంతో స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు తల్లితండ్రులు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబద్ నిమ్స్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. అనారోగ్యంగా ఉందని ప్రిన్సిపల్‌కు చెప్పిన కానీ ఆలస్యం చేయడంతో వహీదా మృతిచెందినదని ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకొని తమ కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థిని తల్లి తండ్రులు కోరారు. అక్కడకు వచ్చిన జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారిని ఎస్.రాజేశ్వరి జిల్లా కేంద్రంలోని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాలు ప్రభుత్వం నుంచి రూ.20 వేలు తక్షణ సహాయం అందించారు.

పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి సంఘాల ఫిర్యాదు

వహీదా మృతి వార్త తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు మృతురాలి ఇంటికి చేరుకుని ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగ వ్యవహరించిన ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి ఎక్స్ గ్రేషియోతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



నవతెలంగాణ-జన్నారం

పార్లమెంటు ఎన్నికల కోడ్ అములులో భాగంగా మండలంలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామనిజన్నారం ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. ఆదివారం మండలంలోని ఇంధనపల్లి గ్రామం వద్ద జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి డబ్బు మద్యం రవాణా కాకుండా చూస్తున్నామన్నారు. వాహనదారుడు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికలు పూర్తి అయ్యేంతవరకు, పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్‌ల వద్ద నిరంతరం తనిఖీ కొనసాగుతుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-జన్నారం

సోమవారం నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు జన్నారంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు. నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మండలంలో మొత్తం మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. ప్రభుత్వ బాలుర పాఠశాలలో 200 మంది, బాలికల పాఠశాలలో 176 మంది, లిటిల్ హాండ్స్ పాఠశాలలో 240 మంది విద్యార్థిని, విద్యార్థులు ఈ పదవ తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వారి కోసం పరీక్షా కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం బెంచీలు, విద్యుత్తు ఫ్యాన్లు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా స్వేచ్ఛ యువత వాతావరణంలో పరీక్షలు రాయాలని కోరారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలు తాత్కాలికంగా బంద్

నవతెలంగాణ-జైపూర్

లోక సభ ఎన్నికల నగారా మోగడంతో ప్రజాపాలన సేవా కేంద్రాల నిర్వాహణ నిలిపివేస్తున్నట్లు స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వం నుంచి తదుపరి అనుమతులు అందే వరకు ప్రజాపాలన సేవా కేంద్రాల సేవలను నిలిపివేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా అందిన ఆదేశాల మేరకు గ్రామీణ ప్రజలు కట్టుబడి ఉండాలని ఈ సంధర్భంగా విజ్ఞప్తి చేశారు.

కార్పోరేషన్ చైర్మన్ జనక్ ప్రసాద్‌కు సన్మానం

నవతెలంగాణ-కాసిపేట



రాష్ట్ర కనీస వేతన సహాయ మండలి కార్పోరేషన్ చైర్మన్‌గా నియామకమైన జనక్ ప్రసాద్‌ను ఆదివారం మండల నాయకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. జనక్ ప్రసాద్‌ను ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ సెక్రెటరీ రాపర్తి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నస్పూరి నర్సింగ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల వేతనాల పెంపునకురషి చేయాలని కోరారు. కాసిపేట మండలంలోని పలు కార్మికుల సమస్యలను ఆయనకు వివరించారు.

ఇసుక దోపిడికి అడ్డేది..?

- వాగులు వంకలు వదలని అక్రమార్కులు
- నామమాత్రంగా వ్యవహరిస్తున్న అధికారులు
- అక్రమంగా డంపు చేసుకుంటున్న వ్యాపారులు



లారీ వద్దకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్(ఫైల్)

నవతెలంగాణ-జైపూర్

జిల్లాలో ఇసుక రవాణ అడ్డు అదుపు లేకుండా అక్రమ రవాణ కొనసాగుతోంది. వాగులు వంకలు వదలకుండా అక్రమార్కులు యెదెచ్ఛగా సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆధాయానికి గండి కొడుతూ అక్రమంగా ఇసుక రవణా చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు ఉన్నాయి. చెన్నూర్ శివారులో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ అనుబంధంగా జైపూర్ మండలాన్ని కేంద్రంగా చేసుకుని రసూల్‌పల్లి, ముదిగుంట, నర్వ గ్రామ శివారుల నుంచి ఇసుక దోపిడికి పాల్పడుతున్నారు. తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత అన్నట్టు గోదావరి ఇసుకతో పాటు వాగులు వంకలను కూడా వదడం లేదు. సులభంగా డబ్బులు సంపాదించు కోవడం కోసం ఇసుక దోపిడికి పాల్పడుతున్నారు. రసూల్‌పల్లి, ముదిగుంట శివారుల్లో జనసంచారం లేకుండా ఉండే ప్రాంతాల్లో ఇసుకను నిల్వ చేస్తున్నారు. ఇక్కడ నిల్వ చేసుకున్న ఇసుక అర్ధ రాత్రి మద్య లారీల ద్వార పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు.



ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన లారీ(ఫైల్)

సులువైన లాభసాటి వ్యాపారం


ఇసుక అక్రమ రవాణా లాభసాటి వ్యాపారంగా కొనసాగుతుంది. ఒక్క లారీ ఇసుక ట్రిప్పు ద్వార ఖర్చులు పోను రూ.30 నుంచి రూ.40 వేలు సంపాదిస్తున్నట్లు తెలియవస్తోంది. ఇదే ఇసుక ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన రీచ్ ద్వార పొందాలంటే ప్రభుత్వానికి రూ.50 నుంచి 60 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఏదైనా ఇసుకే అనుకునే వారు గోదావరి రీచ్‌లో కాకుండా అక్రమ ఇసుక వ్యాపారులను ఆశ్రయిస్తున్నట్లు తెలియవస్తోంది. అక్రమంగా ఇసుక తవ్వితెచ్చిన ఇసుక కోసం అక్రమార్కులకు అయ్యే ఖర్చు కేవలం రూ.15 వేలు మాత్రమే. అది ఏడు ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక ఒక లారీ లోడుకు సరిపోతుంది. ఈ క్రమంలో ఒక్క ట్రాక్టర్ ట్రిప్పు ఇసుకకు ట్రాక్టర్ యజమానికి కేవలం రూ.2 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా స్వల్ప పెట్టుబడితో రెట్టింపు లాభాలు అర్జిస్తున్న అక్రమార్కుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లు కొనసాగుతుందని విమ్మర్శలు విన్పిస్తున్నాయి.



అక్రమంగా నిల్వ చేసిన ఇసుక (ఫైల్)

పట్టించుకోని అధికారులు

అక్రమార్కులను కట్టడి చేయడంలో సంబంధిత శాఖ విఫలమైనట్లు ఆరోపనలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేశామని మైనింగ్ అధికారులు పేర్కొంటున్నప్పటికీ.. వారి కనుసన్నల్లోనే ఇసుక దందా కొనసాగుతుందని పలువురు విమ్మర్శిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా ఏమేరకు కొనసాగుతుందంటే ఇటీవల ఒక లారీతో పాటు పది ట్రాక్టర్లు ఇసుక తరలిస్తూ పట్టుబడ్డాయి. ఇసుక లోడుతో పట్టుబడిన లారీకి రూ. 50 వేలు జరిమాన విధించిన అధికారులు ఒక ట్రాక్టర్‌కు నామమాత్రంగా రూ.5 వేల చొప్పున జరినా విధించారు. నిబంధనల మేరకు ఇంతకు మించి జరిమాన విధించలేమని అధికారులు పేర్కొంటున్నారు. నామమాత్రపు చర్యల్లో భాగంగా అధికారులు వాటిని కావాలని పట్టుకున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.



గోదావరిలో కాపుకాస్తున్న మైనింగ్ అధికారులు

పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశాం

బాలు ఇన్‌చార్జి మైనింగ్ ఏడీ

జైపూర్ మండల కేంద్రంగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నట్లు వస్తున్న ఆరోపనలతో పాటు పరోక్షంగా అందుతున్న పిర్యాదుల మేరకు గోదావరి నదితో పాటు వాగుల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశాము. అక్రమంగా ఇసుక నిల్వలు గుర్తించి వాటిని ఎప్పటికప్పుడు రవాణా చేయించడంతో ఈ మధ్య కాలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని పట్టుకుని జరిమాన విధించాము. ఇసుక తరలింపుకు పాల్పడుతున్న ట్రాక్టర్లను గుర్తించి పట్టుకోవడం జరుగుతుంది. అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయడం కోసం గ్రామీ ప్రజలు సహకరించాలి, పక్కా సమాచారం అందిస్తే శాఖ పరంగా వెనువెంటనే స్పందించి అక్రమ రవాణాను అడ్డుకోవడం జరుగుతుంది.

పెండింగ్ డీఏలు ప్రకటించాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య



నవతెలంగాణ-హాజీపూర్

ఎన్నికల కమీషన్ యొక్క ప్రత్యేక అనుమతితో పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ లను ప్రకటించాలనీ టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సంఘం ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ బదిలీ అయినా ఉపాధ్యాయులను చివరి పని దినం ఏప్రిల్ 23న రిలీవ్ చేయాలన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీల వేతనాలు ప్రతి నెల ఒకటో తేదిన చెల్లించాలన్నారు. పండిట్, పీఈటీలను ఉన్నతి కరించిన 10479 పోస్టులన్నింటిని వెంటనే స్కూళ్లకు కేటాయించి, ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. ఎయిడెడ్, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ, గిరిజన, శాంఘీక సంక్షేమ గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. మల్టీజోన్ 2 ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలన్నారు. లేదంటే మార్చిలో పదవీవిరమణ పొందేవాళ్ళు నష్టపోతారన్నారు. అర్హత కలిగిన ఆశ్రమ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించినట్టు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్సులు చక్రపాణి, రాజావేణు, జిల్లా ఉపాధ్యక్షులు నర్సయ్య, లావణ్య, జిల్లా కోశాధికారి కిరణ్, జిల్లా కార్యదర్శులు చంద్రమౌళి, కిరణ్ కుమార్, దేవదాస్, మాజీ అధ్యక్షులు జి.రామన్న, యం. ఆగచారి మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్సులు పాల్గొన్నారు.

సింగరేణిలో నూతన ఒరవడికి శ్రీకారం

- కార్మికులకు నేరుగా సీఎండీ అభినందనలు



నవతెలంగాణ-జైపూర్

ఆర్థిక సంవత్సరం పూర్తి కావడానికి మిగిలివున్న కొన్ని రోజుల్లో ఉత్పత్తి పెంచడంపై దృష్టి సారించిన సింగరేణి సీఎండీ బలరామ్ కార్మికుల్లో ఉత్సాహపర్చడం కోసం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. రోజువారి పని దినాల్లో అదనపు పనిగంటలు, అత్యధిక ఉత్పత్తికి పాటుపడిన కార్మికులను నేరుగా పలకరించి అభినందనలు తెలుపుతున్నారు. ఈ క్రమంలో రామగుండం ఏరియా-3 ఓపన్‌కాస్ట్ గని కార్మికులు శుక్రవారం నిర్దేశిత లక్ష్యానికి అదనపు ఉత్పత్తిని సాధించి సీఎండీ బలరామ్ నుండి అభినందనలు అందుకున్నారు. ప్రొడెక్షన్ డే పేరుతో ఒక్క రోజులో నిర్ణయిచుకున్న 10 వేల టన్నులకు అదనంగా మరో 8 వేల టన్నుల ఉత్పత్తిని సాధించి మొత్తంగా 18.144 టన్నుల ఉత్పత్తితో గని అత్యధిక రికార్డును సృష్టించారు. కార్మికుల కృషిని గుర్తించిన సీఎండీ బలరామ్ శనివారం గని అధికారులతో పాటు కార్మికులకు నేరుగా ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. అదనపు పని గంటలతో పాటు అత్యధిక ఉత్పత్తి సాధనలో షావెల్స్, డంపర్లు 20 గంటలకుపైగా పని చేయడం ద్వార అత్యధిక ఉత్పత్తిని సాధించి గని చరిత్రలో అత్యధిక రికార్డును సృష్టించిన ఆర్జీ ఓసీ గని కార్మికులు స్ఫూర్తిగా నిలిచారు.

కార్మికుల్లో మరింత ఉత్సాహం

ఆర్థిక సంవత్సరం పూర్తికి మరి కొన్ని రోజులు మాత్రమే మిగిలివుండటంతో కార్మి

కులను ఉత్సాహపర్చాలన్న సీఎండీ వినూత్న ప్రయత్నం కార్మికుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోందని సింగరేణి అధికారులు పేర్కొంటున్నారు. ఆర్జీ-3 ఓసీ గని స్ఫూర్తిగా సింగరేణి వ్యాప్తంగా గనుల వారిగా ప్రొడెక్షన్ డేలు నిర్వహించుకోవడానికి కార్మికులు ఉత్సాహపడుతున్నట్లు తెలిపారు. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యానికి అదనపు ఉత్పత్తి జోడించి వార్షిక లక్ష్య సాధనలో తమవంతుగా భావిస్తున్న కార్మికులు సీఎండీ బలరామ్ అభినందనలు పొందడానికి సమాయత్తం అవుతున్నారని అధికారులు పర్కొంటున్నారు. గతంలో ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తే ఏరియాల వారిగా గుర్తింపుకు మాత్రమే పరిమితమైన కార్మికులు సీఎండీ బలరామ్ మదిలో మెదిలిన ఆలోచనతో నేరుగా అభినందనలు పొందే అవకాశం అందిపుచ్చుకోవాలని కార్మికులు భావిస్తున్నట్లు పేర్కొంటున్నారు. కార్మికులతో కలిసిపోయి, కార్మికుల్లో ఒక్కరిగా, కార్మికుల మనిషిగా అందరి ఆత్మీయుడిగా మిగిలివున్న రోజుల్లో కార్మికుల్లో వచ్చిన కదలికలతో వార్షిక ఉత్పత్తి లక్ష్యం 700 లక్షల టన్నులు సాధించడం సుసాధ్యమన్న భావన అధికారుల్లో కన్పిస్తోంది.

బహుమతులకు బదులుగా అభినందనలు

వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనకు గతంలో బహుమతులు ప్రకటించిన సింగరేణి చరిత్రలో కొత్తగా సీఎండీ బాధ్యతలు చేపట్టిన బలరామ్ బహుమతులకు బదులుగా అభినందనలు ప్రారంభించారు. గడిచిన కొన్ని సంవత్సరాలకు ముందు సింగరేణి యాజమాన్యం ఉత్పత్తిలో కీలకమైన నెలల్లో కార్మికులు గైర్హాజరు కాకుండా ఉండటంతో పాటు ఉత్పత్తిని లక్ష్యాన్ని అధిగమించడం కోసం పలు సంధర్భాల్లో గోడ గడియారాలు, చేతి గడియారాలు, టిఫిన్ బాక్సులు, సైకిళ్లు, డిన్నర్ సెట్లు ఈ విధంగా బహుమతులు ప్రదానం చేసింది. కార్మికులను కార్యోన్ముఖులను చేయడం కోసం గతంలో బహుమతులు అందజేసిన యాజమాన్యం ఇప్పుడు ఆర్థిక భారం పడకుండా పలకరింపుకు పరిమితమై లక్ష్య సాధనకు సీఎండీ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎంపీ ఎన్నికలకు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికలు-2024 కార్యచరణ విడుదల అయిన నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ ఎ.శ్రీనివాస్, జిల్లా అదనపు కలెక్టర్‌లు బి.రాహుల్, సబావత్ మోతిలాల్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి వి.రాములు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, ఖర్చులు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ లోక్సభ ఎన్నికలలో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఏప్రిల్ 18వ తేదీన లోకసభ ఎన్నికల సంబంధిత గెజిట్ నోటిఫికేషన్ విడుదల అవుతుందని, నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏప్రిల్ 25వ తేదీ ఆఖరు రోజు అని, 26వ తేదీన నామినేషన్లను పరిశీలించడం జరుగుతుందని, 29వ తేదీ వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవ్చని, మే 13వ తేదీన పోలింగ్, జూన్ 4వ తేదీన కౌంటింగ్ కార్యక్రమాలు ఉంటాయని, జూన్ 6వ తేదీన ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని, అప్పటి వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. నామినేషన్ దాఖలు చేయు సమయంలో భారత ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, నామినేషన్లను ఉపసంహరించుకోవాలనే అభ్యర్థులు నిర్ణీత సమయంలో ప్రక్రియ పూర్తి చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తమ నామినేషన్లను ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చని, అట్టి నామినేషన్ ప్రతిని సంబంధిత రిటర్నింగ్ అధికారికి నిర్ణీత పని వేళలలో అందజేయాలని తెలిపారు.

యూత్ కాంగ్రెస్ కార్యదర్శుల నియామకం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



మంచిర్యాల జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా నరహరి వెంకటరమణారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కుర్మా మహేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుందని అన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. మాపై నమ్మకంతో ఈ పదవిని కేటాయించిన జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్‌రెడ్డి, టివైసిసి జనరల్ సెక్రెటరీ పి.సంపత్ కుమార్, చెన్నూర్ నియోజకవర్గ శాసన సభ్యులు వివేక్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు గడ్డం వినోద్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కవిత అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ పట్టణ నాయకులు చేసిన ధర్నాలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు పట్టణ కాంగ్రెస్ నేతలు ఖండించి హెచ్చరించారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో పుళ్లూరి సుధాకర్, పలిగిరి కనకరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై వివేక్ వెంకటస్వామిపై అనవసరమైన లేని పోని విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు మరోసారి అనవసరంగా విమర్శిస్తే తగిన గుణపాఠం చెప్పక తప్పదని ఈ పెద్దపల్లి పార్లమెంట్ పరదిలో ప్రతి ఎమ్మెల్యే నియోజవర్గ ప్రాంతాల్లో స్వర్గీయ కాకా వెంకటస్వామి వివేక్ వెంకటస్వామి చేసిన అభివృద్ధి మాత్రమే కనబుతుందనీ వారి చేసిన అభివృద్ధి పనులు ఈ ప్రాంతంలో ఎక్కడికి వెళ్లి చూసినా కనబడతాయనీ అన్నారు. ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే తిరుగుతూ అభివృద్ధి పనులు చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులకు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మారపల్లి రాజయ్య, పుళ్ళురి కళ్యాణ్, రామకృష్ణా, అఫ్జల్ లాడెన్, మల్లేష్, వీరాస్వామి, మహిళ నాయకురాల్లు శారద, సునీత, కమల, దీప, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వాహణలో అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో జరగనున్న లోక్సభ ఎన్నికలు-2024 నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్లతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ఉల్లంఘన, ఇతర ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, 1950, సి-విజిల్తో పాటు ఆఫ్లైన్‌లో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం మార్చి 18 , 2024 www.navatelangana.com

చెక్ పోస్ట్ వద్ద విస్తృత తనిఖీలు

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చొప్పరివల్లి సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అటుగా వెళ్తున్న వాహనాలను, వాహనాల్లో ఉన్న సామాగ్రిని పరిశీలించారు. ఈ తనఖీల్లో కాసిపేట ఎస్సై ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో కెరీర్ గైడెన్స్ సెంటర్‌ను ఆదివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోథ్‌కు చెందిన విద్యావేత్తలు నెలకొల్పిన యూటర్న్ కెరీర్ గైడెన్స్ సెంటర్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే వివిధ పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ ప్రభుత్వ, ప్రయివేట్ రంగాలలోని ఉద్యోగ ఉపాధి అవకాశాలు రాజకీయ వ్యూహాలు, వ్యాపార మార్గాలకు తెలిపేందుకు ఇలాంటి సెంటర్‌ను బోథ్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమనీ అన్నారు. అనంతరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ అడే గజేందర్ మాట్లాడుతూ వివిధ రంగాలలో రాణిస్తున్న వారి ఇంటర్వ్యూలను తీసుకునే విధంగా సెంటర్ ను ఏర్పాటు చేయడం శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో బోథ్, నేరడిగొండ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, డాక్టర్ రవీంద్ర ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు జీవన్‌రెడ్డి, రమేష్‌బాబు, సదానందం, సెంటర్ నిర్వాహకులు అల్లం సాయి కృష్ణ, అడెపు నరేష్, రమణగౌడ్ గొడిసెల పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ వైర్లు తగిలి మహిళ మృతి

నవతెలంగాణ-బెజ్జూర్

సోలార్ విద్యుత్ కంచెకు తగిలి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని చిన్నసిద్దపూర్‌లో జరిగింది. చిన్నసిద్దపూర్ గ్రామానికి ఠాక్రే లక్ష్మీ(55) ఆదివారం సోలార్ విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అడవీ పందుల నుంచి తోటను కాపాడేందుకు చుట్టూ సోలార్ విద్యుత్ కంచెను ఏర్పాటు చేశారు. ఉదయం పని చేస్తున్న సమయంలో లక్ష్మీ దాన్ని గమనించకుండా పనులో నిమగ్నమైంది. ప్రమాదవశత్తు వైర్లు తాగడంతో అపస్మరక స్థితిలో వెళ్లింది. గమనించిన చుట్టూ పక్కల వారు వైద్యం కోసం సిర్పూర్ ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందింది. మృతురాలి తమ్ముడు చెండే శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 10,586 విద్యార్థులు, 53 పరీక్ష కేంద్రాలు
- పరీక్ష కేంద్రాల సందర్శన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి వార్షిక పరీక్షల కోసం పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ ప్రణీత పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 10,586 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు తెలిపారు. వీరి కోసం 53 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 9:30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:50 వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రంలోనికి సెల్‌ఫోన్ ఎట్టి పరిస్థితిలో తీసుకురావద్దని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు స్కూలు యూనిఫామ్ ధరించకూడదని అన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు కేంద్రంలోనికి తీసుకురావద్ద అన్నారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు ఓఎంఆర్ షీట్‌లో తమ వివరాలను పేరును చూసుకోవాలని తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ తప్పనిసరిగా కేంద్రాలకు తీసుకొని రావాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికావద్దని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు.

ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణిని రద్దు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రజావాణి కార్యక్రమ వివరాలను ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి, ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలేవరూ రావద్దని అన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఎదుగుదల

- గోలేటిలో ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్
- విన్నర్‌గా గోలేటి జట్టు
- రన్నరప్‌గా తిర్యాణి జట్టు

నవతెలంగాణ-రెబ్బెన

క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసంతో పాటు ఎంచుకున్న లక్ష్యసాధనలో ఏకాగ్రత పెంపొందుతుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని గోలేటిలో గత 10 రోజుల నుంచి జష్నా క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంటులో 60 జట్లు పాల్గొనగా విన్నర్‌గా గోలేటి జట్టు, రన్నరప్‌గా తిర్యాణి జట్టు నిలిచాయి. గెలుపొందిన గోలేటి జట్టుకు మొదటి బహుమతి రూ.30వేలు, రన్నరఫ్‌గా నిలిచిన తిర్యాణి జట్టుకు రెండో బహుమతి రూ.15 వేలను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, గోలేటి మాజీ సర్పంచ్ పోటు సుమలత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ పర్లపల్లి వనజ, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ నాయకులు కుసుమ విజయ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



పది పరీక్షలకు పటిష్ట బందోబస్తు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. పరీక్షలు రాయడానికి హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా సమాధానాలు రాయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు, విద్యార్థులు సహకరించాలన్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసివేయబడతాయని అన్నారు. దీనికై ముందుగానే వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. పరీక్ష రాయడానికి హాజరయ్యే విద్యార్థులు మాత్రమే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించడం జరిగుతుందని, గేటు మూసివేసిన తర్వాత ఎవ్వరినీ లోపలికి అనుమతించరని అన్నారు. విద్యార్థులకు, ఇన్విజిలేటర్స్, ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్స్‌లకు కూడా ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవన్నారు. పరీక్షా కేంద్రంలో ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే దగ్గరలోని పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు.

ముందస్తు ప్రణాళికతోనే ప్రశాంతంగా ఎన్నికలు

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దష్టి సారించాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్



పాల్గొన్న పోలీసులు

నవతెలంగాణ-గోదావరిఖని:

ముందస్తు ప్రణాళికతోనే ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించగలుగుతామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. రాబోయే జనరల్ ఎన్నికల చట్టాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి అవగాహన కల్పించేందుకు కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులకు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఎన్నికల శిక్షణ సమావేశం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రానున్న జనరల్ ఎన్నికలకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, దానికి అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని సీపీ అన్నారు. అధికారులంతా ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాల్సి ఉంటుందని, ఎన్నికల డ్యూటీ చేస్తున్నటువంటి అధికారులు మోడల్ కోడ్ అఫ్ కండక్ట్‌లో గల అంశాలపై, ఎన్నికల బందోబస్తు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, సిబ్బంది మోహరింపు, కేంద్ర బలగాలతో సమన్వయం తదితర అన్ని అంశాలపై పోలీసు అధికారులకు స్పష్టత ఉండాలని అన్నారు. దానికి అనుగుణంగా పోలీసు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి పోలీస్ అధికారులకు ఎన్నికల నియమావళి పట్ల ఎటువంటి అవగాహనా రాహిత్యం లేకుండా, వారికి గల పలు సందేహాలను నివత్తి చేసేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఎన్నికల్లో కొత్త సవాళ్లు ఎదురవు తాయని, ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, వల్నరబుల్ పోలింగ్ ప్రాంతాలకు గుర్తింపు పట్ల స్పష్టత ఉండాలని, ఎన్నికల నిర్వహణలో పోలీస్ పాత్ర భద్రత దళాల మోహరింపు నామినేషన్ దాఖల నుంచి ప్రచారం పోలింగ్ రోజు నిర్వహణ తదితర అంశాలపై చేపట్టే ప్రణాళికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యా త్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద ఎలా శాంతి భద్రతను పర్యవేక్షించాలని, ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు చేపట్టవలసిన ప్రత్యేక చర్యలు, ప్రత్యేక బందోబస్తుపై సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దష్టి సారించాలని, గత ఎన్నికల్లో అమలు చేసిన గుడ్ ప్రాక్టీస్‌ను అమలు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ముందే ఈ విధంగా అయినా ప్రణాళిక సిద్ధం చేసుకోవడం వల్ల ఎన్నికల నిర్వహణ మరింత సులభతరంగా ఉంటుందని అన్నారు. ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఉత్తమ విధానాలు, పారదర్శకత పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. గత ఎన్నికల సంబంధిత నేరాల చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్లు, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేసుకోవాలని వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారిని సంబంధిత అధికారుల ముందు బైండోవర్ చేయాలని సూచించారు. రామగుండం కమిషనర్ పరిధిలోని వారం రోజులపాటు పోలీస్ అధికారులకు, తరువాత ఏఎస్ఐ, హెచ్‌సి, పిసిలకు ఎన్నికల సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమావే శంలో రెండు జిల్లాలకు సంబంధించిన ఏసీపీలు, సీఐలు, ఎలక్షన్ సెల్ సీఐ, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

ప్రజా నాయకుడు కావాలా...పైసల నాయకుడు కావాలా

- ఢిల్లీ నుంచి గల్లీ దాకా అబద్ధాలతో ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ
- పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ-మంథని



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

ప్రజా నాయకుడు కావాలా.. పైసల నాయకుడు కావాలో ప్రజలు అలోచించి ఓటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు.రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నేపథ్యంలో మంథని నియోజకవర్గం పరిధిలోని కమన్ పూర్, రామగిరి,మండలాల ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశంలో కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులను నిరాశ, నిస్పృహకు గురిచేశాయి. కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెండే ప్రసక్తి లేదు బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ పార్టీ ఇలాంటి ఎన్నో ఒడిదులుకలను ఎదుర్కొని తెలంగాణ తెచ్చిన పార్టీ..ఎన్నికల ఫలితాలు ప్రజలను నిర్వహించినవి మనం వాటిని స్వాగతించాలి అని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి, నీళ్ళు రైతులకు ఇచ్చింది అందించింది నిజం కాదా అని ప్రశ్నిం చారు.కాంగ్రెస్ పార్టీ మంత్రులు ముఖ్యమంత్రి, స్వయంగా రైతు బంధు అడిగితే చెప్పు తీసి కొడతా అంటురన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు భారీ వర్షాలకు వరదా ద్వారా ఒక పిల్లర్ కుంగిపోయింది..దానికి కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని, అసత్య ప్రచారం చేస్తున్నార న్నారు. 50 వేల కోట్లకు అధిపతులు,టూరిస్ట్ నాయకులు ఎన్నికలు రాగానే కనిపిస్తారు...వాళ్ళు గెలిస్తే హైదరాబాద్‌లో ఉంటూ వారి వ్యాపారాలు చూసుకుంటారు. ఈ కార్యక్రమంలో పుట్ట మధూకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసాల పునాదులపైన పరిపాలనలోకి వచ్చిన పార్టీ కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రభుత్వంలోకి రావడానికి 420 హామీలు చెప్పి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కాడని అన్నారు. కెసిఆర్‌పై కోపంతో లక్షల ఎకరాల పంటలను ఎండబెట్టారన్నారు. ఢిల్లీ నుండి గల్లీ దాకా అబద్ధాలతో ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సాగరిక ఫర్నిచర్ మాల్ ప్రారంభోత్సవం



సాగరిక ఫర్నిచర్ మాల్



ప్రారంభిస్తున్న సెల్లో కంపెనీ జోనల్ మెనేజర్ సంతోష్ మిశ్రా

నవతెలంగాణ-గోదావరిఖని:

హైదరాబాద్ మహానగరాలకు ధీటుగా గోదావరిఖనిలో ఎన్నడూ లేని విధంగా సాగరిక ఫర్నిచల్ మాల్ ప్రారంభం అయ్యింది. గోదావరిఖని మార్కండేయకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సాగరిక ఫర్నిచర్ మాల్ ఓపెనింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా సెల్లోకంపెనీ జోనల్ మెనేజర్ సంతోష్ మిశ్రా, స్థానిక కార్పొరేటర్ మంచికట్ల దయాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ఫర్నిచల్ మాల్ ఓపెనింగ్ చేశారు.సాగరిక గ్రూప్స్ చైర్మన్ తిరుపతి, మెనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్ మాట్లాడుతూ తమ వద్ద సోఫాసెట్, రిఫ్రిజిరేటర్స్, టీవీలు, ఏసీలు వాషింగ్ మిషన్స్, కూలర్స్, బీరువాలు, పరుపులు, ఫర్నిచర్ అందుబాటులో ఉన్నాయని, సరమైన ధరలకు వినియోగదారులకు అందిస్తామని చెప్పారు. వినియోగదారులు సాగరిక ఫర్నిచర్ మాల్‌ను సందర్శించి కొనుగోలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సాగరిక గ్రూప్స్ చైర్మన్ తిరుపతి, మెనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్, పలు పక్షాల బాధ్యులు దయానంద్ గాంధీ, సురభి శ్రీధర్, ఆదేపు శ్రీను, అశోక్ రావు, శివ తదితరులున్నారు.

మృతుని కుటుంబానికి సహాయం



సహాయం అందజేస్తున్న గ్రూప్ సభ్యులు

నవతెలంగాణ-గోదావరిఖని:

నిరుపేద కుటుంబానికి చెందిన ఉప్పులేటి మధునయ్య గత నాలుగు రోజుల క్రితం మృతి చెందగా, అతని కుటుంబానికి శ్రీ సీతారామ సేవా సమితి గ్రూప్ సభ్యుల ద్వారా 50 కిలోల బియ్యం, నూనె, నిత్యవసర సరుకులు ఆదివారం అందజేశారు. గ్రూప్ సభ్యులు కార్తీక్ 2వేల రూపాయల, శ్రీ సీతారామ సేవా సమితి గ్రూప్ ద్వారా 3వేల రూపాయల సహకారంతోఈ నిత్యావసర సరుకులు కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు గోలివాడ చంద్రకళ, గాండ్ల స్వరూప, మేడగోనీ స్వప్న, శేఖర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

కార్పొరేషన్ అభివృద్ధి పేరుతో కార్మిక కుటుంబాలను తరలించడం సరైంది కాదు



వినతి అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:

కార్పొరేషన్ అభివృద్ధి పేరుతో సింగరేణి కార్మిక కుటుంబాలను తరలించడం సరైంది కాదని సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకె శ్రీనివాస్‌కు సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ యూనియన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు యాదగిరి సత్తయ్య ఆదివారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి క్వార్టర్స్ నివాస ప్రాంతాలైన సంస్థలో 30 సంవత్సరాల నుంచి నివాసం, క్వార్టర్ అలాట్ మెంట్ సంస్థ ద్వారా తీసుకొని నివసిస్తున్న న్యూ అశోక్ నుంచి కళ్యాణ్ నగర్, ఓల్డ్ అశోక్ ఎదురుగా వికె రెడ్డి స్వీట్ హౌస్ నుంచి మసీద్ టర్నింగ్ వరకు ప్రభుత్వం అభివృద్ధి పేరిట కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న విధానాలను ఆయన ఖండించారు. జాతీయ సంపదను తీయడంలో కీలక భూమిక పోషించిన కార్మికుల సంక్షేమాన్ని వదిలి యాజమాన్యం కూడా నిబంధనలకు నీళ్ళు వదిలి అక్రమంగా నోటీసులు జారీ చేసి నివాసం ఉన్న క్వాటర్స్ ఖాళీ చేయాలని నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ప్రభుత్వ, యాజమాన్యం విధానాలను పునరాలోచించాలని కోరారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వాలు మారినాకొద్దీ నిబంధనలు మార్చి కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడడం హాస్యాస్పదమని అన్నారు.కార్మికుల నివాస ప్రాంతాలైన క్వార్టర్స్ మినహాయించి ప్రభుత్వ అభివద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కు కృతజ్ఞత తెలిపిన మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నవతెలంగాణ-జూలపల్లి/ఎలిగేడు

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్యవైశ్య చిరకాల కోరిక అయిన ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు దానికి సహకరించిన పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయ రమణారావుకి ఆదివారం ఏలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్‌గా కాల్వ సుజాత నియమించడం పట్ల ఏలిగేడు కేంద్రంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎల్లంకి రాజేశం, తాటిపల్లి సతీష్ బాబు ,ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాదూరి మల్లేశం, మల్యాల రమణయ్య, తాటిపల్లి రమేష్ బాబు, పాత మారుతి, కేశెట్టి విద్యాసాగర్ మండల కోశాధికారి కేశెట్టి నాగభూషణం మండల నాయకులు కేశెట్టి లక్ష్మణ్ కుమార్, పాల్గొన్నారు.

సింగరేణి ఆర్జీ-1లో పర్యటించిన కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ, సీఎండీ



స్వాగతం పలుకుతున్న సింగరేణి సీఎండీ

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ విస్మిత తేజ్ ఐఆర్ఎస్, సింగరేణి చైర్మన్, మెనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఐఆర్ఎస్ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఓసీపీ-5 ప్రాజెక్ట్‌ను వారు సందర్శించారు. తదనంతరం క్వారీ వ్యూ పాయింట్‌ని సందర్శించి ఉపరితల గనికి సంబంధించిన మ్యాప్‌ల ద్వారా క్వారీలోని అండర్ గ్రౌండ్ గ్యాలరీలలో పని స్థలాలలో జరుగుతున్న పనిని తెలుసుకున్నారు. భవిష్యత్‌లో చేపట్టబోతున్న ప్రణాళికల, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ఓసీపీ-5 పని ప్రదేశాల కోల్‌బెంచ్‌లు, ఫైర్ ఫైటింగ్ విధానం గురించి చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతకు కంపెనీ చేపడుతున్న ప్రణాళికలు, రక్షణ పట్ల తీసుకుంటున్న జాగ్రత్త చర్యలు, కంపెనీలో చేపడుతున్న నూతన సాంకేతికత, రానున్న రోజులలో కంపెనీలో చేపడుతున్న నూతన ఆవిష్కరణలు, తదితర విషయాలను అడిషనల్ సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ కోల్ వివరించారు. వారి వెంట డైరెక్టర్ ఆపరేషన్స్ అండ్ పా ఎన్‌వికె శ్రీనివాస్, ఆర్జీ 1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ-2 జీఎం ఎల్‌వి.సూర్యనారాయణ, ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకర్ రావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఎస్ఓటూజీఎం రాంమోహన్, పీవో చంద్రశేఖర్, మెనేజర్ అనిల్ గబాలే, సేఫ్టీ అధికారి శ్రీనివాస్, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఇతర అధికారులున్నారు.

